క్లుప్తంగా

వేంకటేశ్వరుని కల్యాణం

బిక్కవోలు: కొమరిపాలెంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ కల్యాణం చేశారు. అర్చకులు పెరవలి వెంకటరామకృష్ణ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాల్లో కల్యాణ కర్తలుగా సూర్యామోడరన్ రైసు మిల్ అధినేత మల్లిడి సూరారెడ్డి, శ్రీలక్ష్మీ దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని సర్పంచి వాసంశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన పూజలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి శివారు ఊరచెరువు సమీపంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ నిర్మాణ కర్త అనంతాత్ముల బాలాజీ, ఆయన సతీమణి ఉష ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ యాగశాలలో హోమాలు జరిపారు. అలాగే 108 దంపతులతో కుంకుమ పూజ నిర్వహించారు.

అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలోని పోతులూరి వీరబ్రహేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన జరిగింది. నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన స్వామివారి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిపారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి, అన్నప్రసాదం స్వీకరించారు.

పునీత జోజప్ప మహోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో పునీత జోజప్ప మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్ మనోజ్ కుమార్ వాక్య సందేశాన్నిచ్చారు. జోజప్ప ఎన్నో కష్టాల కోర్చి, ఇబ్బందులను ఎదుర్కొని దేవుని పట్ల విశ్వాసం చూపారన్నారు. క్రైస్తవులకు స్ఫూర్తి దాయకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కొల్లి జాకోబ్, రాయి థామస్, కాతేటి జార్జి, కొల్లి సుందరరావు, చుక్కా శ్యామల, కాతేటి ఇందిర పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి చేయూత

గోకవరం: గ్రామంలో అరుదైన బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న రెండున్నరేళ్ల బాలుడు సత్యశ్రీ అక్షయ్‌రామ్ వైద్యానికి మండలంలోని వీరలంకపల్లి శివారున ఉన్న హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ సిబ్బంది చేయూతనందించారు. ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, లారీ డ్రైవర్లు కలిసి సుమారు రూ.50 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని మేడే దినోత్సవం సందర్భంగా సోమవారం బాలుడి తండ్రికి అందజేశారు. .

సబ్ పోస్టాఫీస్‌గా పెదపూడి బ్రాంచి

పెదపూడి: కాకినాడ జిల్లాలోని పెదపూడి బ్రాంచ్ పోస్టాఫీస్‌ను సబ్ పోస్టాఫీస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. సోమవారం ఈ తపాలా కార్యాలయాన్ని గ్రామ సర్పంచ్ కె.కృష్ణమూర్తి ప్రారంభించారు. పెదపూడి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ నూతన తపాలా కార్యాలయంలోని అన్ని సదుపాయాలను వినియోగించుకోవాలని అన్నారు. కాకినాడ డివిజనల్ సూపరింటెండెంట్ డి.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూయుఎస్ పోస్టాఫీసులు ఇప్పుడు బ్యాంకులకు ధీటుగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో విజయ భాస్కరరావు, జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ డి.నాగేశ్వరరెడ్డి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొయ్యలగూడెం: ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో సోమవారం సాయంత్రం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యలగూడేనికి చెందిన మాచవరపు శ్రీనివాస్ (28)కు, అతని భార్యకు ఇటీవల మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆమె పిల్లలిద్దరినీ తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం తన బంధువులతో కలసి శ్రీనివాస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు శ్రీనివాస్‌ను తూర్పుగోదావరి జిల్లా సీతానగరం తీసుకెళ్లి విచారణ చేశారు. మూడు రోజులపాటు అతన్ని స్టేషన్‌లో ఉంచి హింసించారని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాపురం చేసుకోకపోతే చంపుతామని బెదిరించారన్నారు. ఈ నేపథ్యంలో ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి కొయ్యలగూడెం చేరుకున్న శ్రీనివాస్.. భయంతో గ్రామంలోని తనకు తెలిసిన మహిళ నివాసంలో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. తమ కుమారుడి ఆత్మహత్యకు సీతానగరం ఎస్‌ఐ శుభశేఖర్, చంద్ర, దుర్గబాబులే కారణమని మృతుని తల్లిదండ్రులు సత్యనారాయణ, నాగమణి ఆరోపించారు. స్థానిక ఎస్‌ఐ జీజే విష్ణువర్ధన్ ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేస్తున్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

రంగంపేట: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వాకాడ అమ్మాజీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఒక వినతి అందినట్టు తెలిపారు. రంగంపేటలోని సూర్యమిత్ర టౌన్‌షిప్‌లో వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసి పీవీ శివప్రసాద్ వినతి పత్రం అందించారు. సమస్యను సంబంధిత శాఖకు బదిలీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

ఉరుకులు పరుగులు

- అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన
- ముమ్మరంగా మాసూళ్లు
- పనుల్లో అన్నదాత బిజీబిజీ



పందలపాకలో వర్షానికి ధాన్యం తడవకుండా బరకాలతో కప్పి ఉంచిన రైతులు

బిక్కవోలు: అకాల వర్షాలతో అన్నదాత గుండెల్లో గుబులు రేగింది. కళ్లాల్లో ఉన్న పంటను కాపాడుకునేందుకు పరుగులు తీస్తున్నారు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గంలో 70 వేల ఎకరాల్లో రబీ వరి సాగు చేశారు. ప్రస్తుతం మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 82 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఈ ఏడాది పంట కూడా బాగానే పండింది. ఎకరాకు 45 నుంచి 50 బస్తాలు పైగా దిగుబడి లభిస్తోంది. అసలే కూలీలు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్న సమయంలో వర్షాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని చోట్ల కూలీల కొరతతో వరి కోత యంత్రాలతో కోతలు పూర్తి చేస్తున్నారు. యంత్రాలతో కోసి ధాన్యాన్ని ఎండలో ఆరబెడుతున్నారు. ఇందుకు ప్రధానంగా రహదారులనే ఆశ్రయిస్తున్నారు. కొందరు పంటను కళ్లాలోనే నిల్వ చేశారు. అయితే అనుకోకుండా కురిసిన వర్షాలు పక్వానికి వచ్చిన పంట ఎక్కడ నష్టపోతామోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొసిన ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు ఉపక్రమించారు. సోమవారం ఉదయం నుంచి ఆరబోసిన ధాన్యాన్ని కుప్పలుగా పోసి వర్షానికి తడిసిపోకుండా బరకాలు, తార్పాలిన్లు కప్పుతున్నారు. రైతులందరూ ఒకేసారి పనులు చేపట్టడం వల్ల కూలీల కొరత ఏర్పడింది. దీంతో వారికి డిమాండ్ పెరిగి కూలిని పెంచేశారు. అలాగే ధాన్యంపై కప్పేందుకు గ్రామాల్లో ప్లాసిక్ బకరాలు డిమాండ్ ఏర్పడింది. ఇదే అదునుగా కొందరు దళారులు ధాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు గొదాములు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అనపర్తి, రాజానగరంలో నియోజకవర్గంలోని 70వేల ఎకారలకు గాను 58 వేలు ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

భారీ వర్షం

గోకవరం: మండల వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జన జీవనం పూర్తిగా స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైతులు పలు ఇబ్బందులు పడ్డారు. మరోపక్క గత కొన్ని రోజులుగా వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు వర్షానికి సేదతీరారు.

తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ



పందలపాకలో వృద్ధుడికి పింఛను సొమ్ము అందిస్తున్న వలంటీర్



కోరుకొండ మండలం బుచ్చెంపేటలో దివ్యాంగురాలికి పింఛన్ అందిస్తున్న దృశ్యం

బిక్కవోలు: వైఎస్సార్ పెన్షన్ కానుకను మండలంలోని మొదటి రోజు సోమవారం తెల్లవారుజాము నుంచే పంపిణీ చేశారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను నగదు అందజేశారు. మొదటి రోజు మండల వ్యాప్తంగా 84.11 శాతం మేర పంపిణీ చేశారు. మొత్తం 10,475 మంది లబ్ధిదారులకు గాను రూ.2,85,18,000 నగదు చెల్లించాల్సి ఉండగా 8,803 మంది లబ్ధిదారులకు రూ.2,39,87,500 నగదు అందించారు.

మధురపూడి: కోరుకొండ మండలంలో సోమవారం ఉదయమే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. తెల్లవారుజామునే వలంటీర్లు, గృహసారథులు.. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. మండలంలోని 22 గ్రామాల్లో 12,189 మంది లబ్ధిదారులున్నారు.

వర్షంలోనూ పింఛన్ల పంపిణీ

రంగంపేట: మండల వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుంచి వర్షం ప్రారంభమైనా లెక్క చేయకుండా వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలోను వలంటీర్లు పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 8907 మంది పింఛనుదారులకు రూ.24474250 నగదును అందిచనున్నట్టు అధికారులు తెలిపారు.

దాసాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

గోకవరం: స్థానిక మెయిన్‌రోడ్డు చెంత వేంచేసిన దాసాంజనేయస్వామి ఆలయ 98వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథ శర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వీరభద్రస్వామికి పూజలు



వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

రంగంపేట: స్థానిక సాయినగర్‌లో ఉన్న వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పూజలు చేశారు. వీరభద్రస్వామిని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏటా వీరభద్రస్వామికి వార్షికోత్సవం నిర్వహించి, అన్నసంతర్పణ చేయడం అభినందనీయమన్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. ఈ అన్నదానానికి గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాలకు చెందిన భక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఆలయ కమిటీ సభ్యులు యానాల త్రిమూర్తులు, బొట్టు స్వామి, మెకానిక్ ప్రసాద్, కేతా సత్యనారాయణ, కొండి జెమి, మద్దిపాటి సుధీర్, సాయి కిరణ్ తదితరులు తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: పొలమూరులో పునర్నిర్మించిన రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాల స్వామివారి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజు సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. హోమాది క్రతువుల్లో ప్రధాన కర్తలుగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని పూజలు జరిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో దీక్షదారులు జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఉపసర్పంచి సత్తి సూరారెడ్డి విజయమణి, వ్యాపారవేత్తలు సత్తి శ్రీనివాసరెడ్డి రమ, సత్తి బ్రహ్మారెడ్డి గంగా పార్వతి, తాడి సత్తిరెడ్డి సుబ్బలక్ష్మి, తాడి వీరవెంకటరెడ్డి, కమల, సత్తి వెంకటరెడ్డి వీర అనంతలక్ష్మి, ఆలయ చైర్మన్ తమలంపూడి ఆదిరెడ్డి వీరయ్యమ్మ, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, ఎంపీటీసీ సత్తి కనకారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సత్తి అమ్మిరెడ్డి, దొరబాబు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ మండ స్వామి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

రంగంపేట: నిత్యం దైనందిన జీవితంలో యోగ, ధ్యానం చేయడం శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుందని సత్యసాయి సేవా సంస్థల జిల్లా విభాగ సమన్వయ కర్త ఎల్. శ్రీనివాసరాజు సూచించారు. స్థానిక సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో నిర్వహించిన బాల వికాస్ వారోత్సవాల్లో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. అభినయ గేయాలు, పద్య సూక్తులు, శ్లోకం, కథలపై అవగాహన పెంచుకుని నిత్య జీవితంలో వాటిని ఆచరించాలన్నారు. కోటపాడు, ఈలకొలను గ్రామాల్లోని సాయి మందిరాల్లో బాల వికాస్ కార్యక్రమాలు నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం



తంటికొండలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపిస్తున్న పండితులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం సోమవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. ఉదయం స్వామి వారి గిరి ప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఈఓ చందన ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణాన్ని జరిపారు. మండలం నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాలు, రాజమహేంద్రవరం నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చారు.

అనపర్తి: స్థానిక కెనాల్ రోడ్డులో ఉన్న అలివేలుమంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని సోమవారం రాత్రి వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భోగేశ్వరశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ రామకృష్ణశర్మ, సుబ్రహ్మణ్యశర్మలు నిర్వహించిన శ్రీవారి కల్యాణోత్సవంలో స్థానిక ఎస్‌విఆర్ ఫ్రూట్స్ కంపెనీకి చెందిన సబ్బెళ్ల కృష్ణారెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించగా గ్రామానికి చెందిన తేతలి కిషోర్‌రెడ్డి, మాధురి దంపతులు కల్యాణ కర్తలుగా కల్యాణ క్రతువును జరిపించారు. పండితులు వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన ఈ కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం

రాజానగరం: లాలాచెరువులోని మంజీరా మాల్‌లో సోమవారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మండల ఆర్యవైశ్య సంఘం తరఫున మండల అధ్యక్షుడు మండవల్లి వెంకన్నబాబు, ప్రతినిధులు సముద్రాల రాంబాబు, గ్రంధి నానబ్బులు, గ్రంధి గణేష్, గ్రంధి రాజా, కంకటాల రాజు, దవులూరి శ్రీను, కంకటాల మహేష్ తదితరులు తరలివెళ్లారు.

ప్రతి రైతుకు మద్దతు ధర కల్పిస్తాం

కాకినాడ జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయకుమార్



కరకుదురులో రైతులతో మాట్లాడుతున్న విజయకుమార్

పెదపూడి: వాతవారవణ పరిస్థితుల దృష్ట్యా ధాన్యం కొనుగోలులో తేమ శాతం, పరిమాణాలు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రతి రైతుకు మద్దతు ధర కల్పిస్తామని కాకినాడ జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.విజయకుమార్ అన్నారు. మండలంలో పెదపూడి, కరకుదురు, దోమాడ, జి.మామిడాడ గ్రామాల్లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.విజయకుమార్, ఏడీఏ ఎం.పద్మశ్రీ, తహసీల్దార్ టి.శుభాష్, ఎంపీడీఓ పి.విజయ భాస్కర్, ఏఓ టి.వి.ఆర్.మణిదీప్ తదితరులు సోమవారం కురిసిన వర్షాలకు తడిసిన వరి పంట, ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం పరిస్థితుల దృష్ట్యా వరి కోతలు మూడు రోజులు వాయిదా వేసుకోవాలన్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని నీటి నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని 5 శాతం ఉప్పునీటి ద్రావణంతో పిచికారీ చేయడంతో గింజ మొలకెత్తకుండా ఉంటుందని రైతులకు తెలియజేశారు. రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



గోకవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

గోకవరం: మండలంలో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కేఎస్ఎన్ మూర్తి పరిశీలించారు. నూక శాతం పరీక్ష చేసే మినీ మిల్‌ను మండల కేంద్రమైన గోకవరంలో ఏర్పాటు చేయగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ రాజేశ్వరి, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ఘనంగా ఏఎంసీ చైర్మన్ పుట్టిన రోజు వేడుకలు



పారిశుధ్య కార్మికులు, నిరుపేదలకు నిత్యావసర వస్తువుల కిట్లు అందజేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, రామవరం ఉప సర్పంచ్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి పుట్టిన రోజు వేడుకలు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి స్వగ్రామం రామవరం గ్రామ సచివాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ శ్రేణుల సమక్షంలో కృష్ణారెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం కృష్ణారెడ్డి తనయుడు దివంగత సబ్బెళ్ల సురేష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి సమకూర్చిన రూ.10వేలు విలువ గల నిత్యావసర వస్తువులు పంచాయతీ పారిశుధ్య కార్మికులు, నిరుపేదలకు అందజేశారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనపై ప్రేమాభిమానాలు చూపించే పార్టీ శ్రేణులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రముఖులు, ఉద్యోగులు కృష్ణారెడ్డికి పూలమాలల వేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచి గిరడా గంగాభవాని, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పెదపూడి ఎంపీపీ కేతా తులసి శ్రీనివాస్, జెడ్పీటీసీ పేపకాయల వెంకటరమణ, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు చంటి, ఎంపీటీసీ చండ్రాళ్ల రమణ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వాసు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యా పథకం అర్హత పరీక్షకు 950 మంది హాజరు



లాటరీ ద్వారా ఎంపిక చేసిన పరీక్ష పేపర్ సెట్‌ను ప్రకటిస్తున్న డాక్టర్ తాడి రామగురెడ్డి

అనపర్తి: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) అనపర్తి శాఖ, స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న ఉచిత విద్యా పథకం–2023 అర్హత పరీక్షను జీబీఆర్ విద్యా సంస్థల ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా విద్యార్థులు భారీగా పరీక్షకు హాజరయ్యారు. ఈ అర్హత పరీక్షలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ ఒక్కో తరగతి నుంచి ఐదుగురు విద్యార్థులను, ఎంపిక చేసి వారికి ఇంగ్లిష్ మీడియంలో ఉచిత విద్యను అందిస్తున్న విషయం పాఠకులకు విదితమే. ఐఎంఏ తోడ్పాటుతో జీబీఆర్ నిర్వహిస్తున్న ఉచిత విద్యా పథకంలో భాగంగా నిర్వహించిన ఈ అర్హత పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకున్న 1009 మందిలో 950 మంది విద్యార్థులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు 320 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా తరగతికి ఐదుగురు చొప్పున డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. పరీక్ష ప్రారంభానికి ముందుగా టాలెంట్ టెస్ట్ కోర్ కమిటీ రూపొందించిన పరీక్ష పేపర్ సెట్లలో రాయవరం చాణిక్య నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో లాటరీ తీసి సెట్‌ను ఎంపిక చేయగా ఈ సెట్‌ను విద్యార్థులకు పంపిణీ చేసి పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎంఏ అనపర్తి శాఖ అధ్యక్షుడు డాక్టర్ తాడి రామగురెడ్డి మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా వారికి ఉచిత విద్యను అందించే ఉద్దేశ్యంతో ఐఎంఏ ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.వెంకట్రామిరెడ్డి, డాక్టర్ కేఎస్‌వీ కృష్ణారెడ్డి, డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎం.కృష్ణారెడ్డి, డాక్టర్ భాష తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

పూడికతీత పనుల పరిశీలన



పెదపూడిలో పూడిక తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ హరికృష్ణ సత్యరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో డ్రైన్లలో పూడిక తొలగించాలని, పారిశుధ్య కార్మికులతో సచివాలయ కార్యదర్శులు పనులు చేయించాలని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి ఆదేశించారు. ఆయన పెదపూడి, కరకుదురు, దోమాడ గ్రామాల్లో డ్రైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హరికృష్ణ సత్యరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో రోడ్లపైన, మురుగు గుంటల్లో మురుగు నీరు నిలిచిపోయి ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, బి.ప్రసన్నకుమార్, త్రినాథ్, ఎస్‌వీ స్వామి, అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం



సీతానగరంలో జెండా ఎగురవేస్తున్న సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వీరబాబు



ఏపీత్రయంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్మిక సంఘాల అధ్యక్షుడు రాజు

రాజానగరం: ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాజానగరం, సూర్యారావుపేట వేడుకలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల సెంటర్‌లో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు, సాయిబాబా గుడి సెంటరులో మహిళ సంఘం నాయకురాలు బ్రాహ్మణపల్లి భవానీ మే డే పతాకాలను ఎగురవేశారు. సూర్యారావుపేటలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పి.వెంకట్ నాయుడు ఎర్ర జెండాను ఎగురువేశారు. అలాగే రాజానగరం, దివాన్‌చెరువుల్లో ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు కేక్ కట్ చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఎర్రజెండా ఎగురవేశారు.

గోకవరం: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని సోమవారం మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. చైర్మన్ పైడిమళ్ల లక్ష్మణ్ రావు, కార్యదర్శి అక్కిరెడ్డి కృష్ణ, అధ్యక్షుడు ప్రగడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలలో మేడే దినోత్సవాన్ని కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాయి. సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో సీతానగరం బస్టాండ్ సెంటర్ వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పలివెల జ్యోతి, అధ్యక్షుడు సిద్దె నాగ రాజు, జిల్లా కమిటీ మెంబర్ నందమూరి చిట్టిస్వామి, మండల అధ్యక్షుడు తెలగరాపు రమేష్ పాల్గొన్నారు.

కార్మికుల ర్యాలీ

అనపర్తి: మండలంలో ప్రపంచ కార్మిక దినోత్సవం ఘనంగా జరిగింది. సీఐటియూ ఆధ్వర్యంలో ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐటీసీ వర్కర్స్ యూనియన్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మిడ్ డే మీల్స్ తదితరులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐఎల్‌టీడీ ప్రధాన ద్వారం వద్ద ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐటీసీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసంశెట్టి వెంకట్రావు జెండా ఆవిష్కరించారు. శామ్యూల్‌రాజ్, వాసంశెట్టి సూర్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకురాలు భ్రమరాంబ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

పెదపూడి: కార్మికులు విజయానికి మే డే గుర్తు అని, దేశ అభివృద్ధిలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని సీఐటీయూ జిల్లా నాయకురాలు, అంగన్‌వాడీ కార్యకర్తల అసోసియేషన్ మండల నాయకురాలు ఎం.రాజేశ్వరి అన్నారు. పెదపూడి ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం వద్ద మే డే జెండాను ఆమె ఆవిష్కరించారు. మండల సీఐటీయూ మండల అధ్యక్షుడు వీ.శివ, అంగన్‌వాడీ కార్యకర్తలు వి.భారతి, జి.సత్యవతి, ఏ.కనకదుర్గ, ఎస్.మాధవి తదితరులు పాల్గొన్నారు. ఏపీత్రయం గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో కాకినాడ జిల్లా ఐఎన్‌టీయుసీ కార్మిక సంఘాల అధ్యక్షుడు తాళ్లూరు రాజు పాల్గొన్నారు. ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి మేడే జెండా ను ఆయన ఆవిష్కరించారు.

స్విమ్మింగ్ శిక్షణ ప్రారంభం

పెదపూడి: వేసవి స్విమ్మింగ్ శిక్షణ తరగుతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జీఆర్‌ఎస్ఏ క్లబ్ ముఖ్య సలహాదారుడు మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని జీఆర్ఎస్ఏ(ఫ్యామిలీ హెల్త్ క్లబ్)లో సోమవారం విద్యార్థులు, చిన్నారులకు వేసవి ఈత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు రఘురామచంద్రారెడ్డి, కోశాధికారి పడాల గంగాధర్‌రెడ్డి, ఈ క్లబ్ మాజీ అధ్యక్షుడు అప్పారెడ్డి, కార్యవర్గ సభ్యులు సోమిరెడ్డి, భాస్కరరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

204 మందికి వైద్యసేవలు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో రామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. సాధారణ శిబిరంలో 162 మందికి, కంటి శిబిరంలో 42 మందికి వైద్య పరీక్షలు జరిపారు. 10 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ సత్యం రమేష్ బాబు, డాక్టర్ యన్నమనేని రామచంద్రరావు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, వై.వెంకట నారాయణ, చంటిబాబు, గద్దె రామకృష్ణ, భాస్కరరావు పాల్గొన్నారు.